ఉధృతి తగ్గేవరకు అప్రమత్తంగా ఉండాలి


అధికారులతో సమీక్షిస్తున్న మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్

వేమూరు: కృష్ణానది వరద ఉధృతి పూర్తిగా తగ్గేవరకు అధికారులందరూ అప్రమత్తంగా ఉండి సహాయక చర్యలు చేపట్టాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. జగ దిగ్బంధంలో చిక్కుకున్న లంక గ్రామాల ప్రజలకు భోజనం, తాగునీరు, ఇతర పదార్థాలను పంపిణీ చేస్తున్న ప్రక్రియను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబులతో కలిసి మంగళవారం పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో వరద పరిస్థితిపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడారు.

న్యూస్‌రీల్

వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించిన జేసీ



నాదెండ్ల: అల్పపీడన ప్రభావంతో దెబ్బతిన్న పంటలను మంగళవారం జాయింట్ కలెక్టర్ సూరజ్ నరసరావుపేట ఆర్డీవో స్వర్ణలతతో కలిసి పరిశీలించారు. యడ్లపాడు మండలం లింగారావుపాలెం గ్రామంలో దెబ్బతిన్న పంటల వివరాలను వ్యవసాయాధికారుల నుంచి తెలుసుకున్నారు. రైతులతో మాట్లాడారు. తక్షణమే దెబ్బతిన్న పంటల వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి అందజేయాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ విజయశ్రీ, నరసరావుపేట వ్యవసాయ సంచాలకులు పి మస్తానమ్మ, ఏవో సరిత, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

95 మంది వికలాంగ పింఛన్‌దారులకు నోటీసులు


శావల్యాపురం: మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్నటువంటి 95 మంది వికలాంగులకు నోటీసులు అందజేసినట్లు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నోటీసులు అందుకున్న వారందరు ఈనెల 5న వినుకొండ పట్టణంలో ప్రభుత్వ వైద్యశాల్లో ప్రత్యేక వైద్యుల సమక్షంలో నిర్ధారణ చేయించుకోవాలని సూచించారు. నిర్ధారణ కాని వారందరికి వచ్చే నెలలో ప్రభుత్వం పింఛన్ నిలుపుదల చేస్తుందన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం


మృతుడు గోపీనాయక్

అచ్చంపేట: మండలంలోని తాడువాయి వద్ద చప్టాపై ప్రవహిస్తున్న నీటి ప్రవాహంలో కొట్టుకుపోయిన భూక్యా గోపీనాయక్(32) మృతదేహాన్ని మంగళవారం ఉదయం స్థానికులు గుర్తించారు. పులిచింతల ప్రాజెక్టు నుంచి ఆదివారం రాత్రి 6.50లక్షల క్యూసెక్కులు వదలడంతో తాడువాయి వద్ద గల చప్టాపైగా నీరు ప్రవహించింది. స్వగ్రామం సంద్రతండాకు నీటిలో నడుచుకుంటూ వస్తున్న గోపీనాయక్ ప్రవాహ వేగానికి కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ దళాలు పరిసర ప్రాంతాలతోపా టు, కృష్ణానదిలో సోమవారం రాత్రి వరకు తీవ్రంగా గాలించాయి. మంగళవారం వరద ప్రవాహం తగ్గడంతో మృతదేహాన్ని స్థానికుల ద్వారా గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు.

పులిచింతల నుంచి తగ్గిన నీటి ఉధృతి



అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి నీటి ప్రవాహ ఉధృతి తగ్గింది. సోమవారం ప్రాజెక్టు నుంచి 21 గేట్ల ద్వారా 4.50లక్షల క్యూసెక్కులు వదలగా మంగళవారం సాయత్రానికి తొమ్మిది గేట్ల నుంచి 2.94 క్యూసెక్కులు మాత్రమే దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 41.73 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇది 173 అడుగుల లోతుకు సమానం.

మేజర్ కాలువలకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

ఎన్ఎస్‌పీ కెనాల్స్ ఎస్ఈ వరలక్ష్మి



బెల్లంకొండ: భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న బ్రాంచ్ కెనాల్స్, మేజర్ కాలువలకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయిస్తున్నట్లు నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ కెనాల్స్ ఎస్ఈ వరలక్ష్మి చెప్పారు. రెండు రోజుల కిందట కురిసిన భారీ వర్షాలకు మండలంలోని నాగిరెడ్డిరెడ్డిపాలెంలో గండి పడిన మేజర్ కాలువను అధికారులతో కలసి మంగళవారం పరిశీలించారు. ఎగువ నుంచి వచ్చే నీటితోపాటు అటవీ ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు భారీగా కాలువకు వచ్చి చేరడంతో ఎర్రబాలెం మేజరు కాలువకు గండిపడినట్లు పేర్కొన్నారు.

పంటలు కృష్ణార్పణం

రైతులు ఎన్నో వ్యయప్రయాసలకోర్చి సాగు చేసిన పంటలు వరద పాలయ్యాయి. అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలతో పాటు కృష్ణా నదికి వచ్చిన వరదతో పంట పొలాలు నీటమునిగాయి. పొలాల్లోనే నీరు ఉండడంతో ఉరకెత్తి పంటలు దెబ్బతిన్నాయి. దీంతో రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది.


అమరావతి మండలంలో నీట మునిగి నలుపు రంగులోకి మారిన పత్తి సాగు

రైతుల ఇంట కన్నీరు

- 21,625 ఎకరాల్లో నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా
- 1,187 ఎకరాల్లో ముంపునకు గురైన ఉద్యాన పంటలు
- నష్టం మరింత పెరిగే అవకాశం
- ఇంకా వరద నీటిలోనే పత్తి పంటలు
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న రైతులు
- వరద ముంపులోనే లోతట్టు ప్రాంత ప్రజలు
- తూతూమంత్రంగా పునరావాస సాయం


అమరేశ్వర ఘాట్‌లో కృష్ణానది ప్రవాహం

సాక్షి, నరసరావుపేట: అల్పపీడన ప్రభావంతో జిల్లాలో కురిసిన భారీ వర్షాలు తగ్గుముఖం పట్టినప్పటికీ ముంపు ప్రాంత రైతులు, ప్రజలకు కన్నీరు మిగిల్చాయి. ఆది, సోమవారాలు ఉధృతంగా ప్రవహించిన వాగులు, వంకలు మంగళవారం నాటికి శాంతించాయి. మరోవైపు కృష్ణానది వరద పులిచింతల వద్ద 4.16 లక్షలకు తగ్గడంతో నదిలో ప్రవాహం తగ్గుముఖం పట్టింది. మంగళవారం మధ్యాహ్నం నుంచి పునరావాస కేంద్రాలలో తలదాచుకున్న వారు తమ ఇళ్లకు వెళ్లి ఇంటిలో చేరిన బురద, చెత్తను తొలగించేపనిలో నిమగ్నమయ్యారు. పంట పొలాల్లో మాత్రం ఇంకా వరద నీరు పూర్తిస్థాయిలో ఇంకిపోలేదు. దీంతో రైతులకు ఊహించిన దానికన్నా ఎక్కువ నష్టం చేకూరుతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, సిబ్బంది నీట మునిగిన పంట పొలాలను మంగళవారం కూడా పరిశీలిస్తున్నారు. ప్రాథమికంగా ముంపునకు గురైన పంటల వివరాలను నమోదు చేస్తున్నారు. జిల్లాలో 195 గ్రామాల పరిధిలో 9,191 మంది రైతులకు చెందిన సుమారు 21,625 ఎకరాల్లో వ్యవసాయ పంటలు నష్టపోయినట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. ఇందులో అత్యధికంగా 18,855 ఎకరాల్లో పత్తి పంట నష్టం కలిగింది. మరోవైపు జిల్లాలో 527 మంది రైతులకు చెందిన 1,173 ఎకరాల్లో ఉద్యాన పంటలు వర్షాలకు దెబ్బతిన్నాయి. ఇవి కేవలం ప్రాథమిక అంచనాలు మాత్రమేనని సమగ్ర నష్ట వివరాల సేకరణ పూర్తయితే నష్టపోయిన పంట విస్తీర్ణం మరింత పెరిగే అవకాశముంది.

తీవ్రంగా నష్టపోయిన రైతులు

జిల్లాలో అల్పపీడన ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోయారు. ముఖ్యంగా పత్తి పంటలో నీరు నిలవడంతో మొక్కలు కుళ్లిపోయాయి. అమరావతి మండలంలోని మెట్ట ప్రాంతాలైన మల్లాది, పొందుగల, మునగోడు, ముత్తాయపాలెం జూపూడి, దిడుగు, ధరణికోట, పెదమద్దూరు, అమరావతి, నరుకుళ్లపాడు, చావపాడు, ఎండ్రాయి, వైకుంఠపురం గ్రామాలలో పంట పొలాలు నాలుగు రోజులుగా నీటమునిగి ఉండటంతో పూర్తిగా మొక్కలన్నీ చనిపోయాయి. అచ్చంపేట, క్రోసూరు, రొంపిచర్ల, దాచేపల్లి మండలాల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారు. పత్తితోపాటు మిరపనారు, వరి కంద, పసుపు, వరి నారుమళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రభుత్వం ఉదారంగా సాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

మాటలకే పరిమితమైన ప్రభుత్వ సాయం

వరద బాధితులకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి వారికి అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామని ప్రభుత్వం, అధికారులు ఓ వైపున గొప్పలు చెప్పుకుంటూ ఉంటే మరోవైపు బాధితులు కనీసం సాయం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరణికోట జైల్‌సింగ్ కాలనీ వాసులకు సోమవారం భోజనాలు పెట్టడం మానేశారని బాధితులు వాపోతున్నారు. అమరావతిలో కాలనీలు నీట మునిగి అధికారుల సాయం కోరితే పట్టించుకోలేదని, కేవలం ఫొటోలు తీసుకొని వెళ్లిపోతున్నారని బాధితులు గోడు వెళ్లబోసుకుంటున్నారు. వరద బాధితులకు కొన్నిచోట్ల కేవలం బియ్యం ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. అసలే మూడు రోజులుగా ఉపాధిలేని దినసరి కూలీలకు ఇతర కనీస అవసరాలకు కొంత నగదు సహాయం చేయకపోవడంపై పెదవివిరుస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 11 పునరావాస కేంద్రాలు పనిచేస్తుండగా, ఇప్పటికే ఆరు కేంద్రాలను మూసేశారు. వీటిలో 3,240 మంది బాధితులు ఆశ్రయం పొందారు.

జిల్లాలో 82.1 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

నరసరావుపేట: గడిచిన 24గంటల వ్యవధిలో జిల్లాలో 82.1 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా యడ్లపాడులో 16.1 మి.మీ వర్షం కురిసింది. నకరికల్లు, కారెంపూడి, దుర్గి, వెల్దుర్తి మండలాల్లో అసలు వర్షపాతమే నమోదుకాలేదు. మిగతా మండలాలు పరిశీలిస్తే...నరసరావుపేటలో 5.6, మాచర్లలో 4.0, రెంటచింతలో 4.6, గురజాలలో 3.9, దాచేపల్లిలో 0.8, పిడుగురాళ్లలో 1.4, మాచవరంలో 1.2, బెల్లంకొండలో 5.0, అచ్చంపేటలో 0.2, క్రోసూరులో 1.4, అమరావతిలో 3.6, పెదకూరపాడులో 4.4, సత్తెనపల్లిలో 4.6, రాజుపాలెంలో 2.6, రొంపిచర్లలో 2.4, బొల్లాపల్లిలో 4.2, వినుకొండలో 1.8, నూజెండ్లలో 1.2, శావల్యాపురంలో 0.6, ఈపూరులో 2.6, ముప్పాళ్లలో 3.2, నాదెండ్లలో 3.2, చిలకలూరిపేటలో 3.2 మి. మీటర్ల వర్షం కురిసింది.


పిడుగురాళ్ల పట్టణంలోని చిన్న కాలువ సమీపంలో విరిగిపడిన విద్యుత్ స్తంభం

పంట నష్టపోతే పట్టించుకున్న నాథుడే లేడు...



నేను రెండు ఎకరాలలో పూలు, కూరగాయాలు సాగు చేసే సన్నకారు రైతుని. అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు కూరగాయల మొక్కల పూత, పిందె రాలిపోయింది. పూల మొక్కలు నీరు ఎక్కువగా నిలిచి కుళ్లిపోయాయి. నా పంట మొత్తం నష్టపోయాను. అయినా ఇప్పటి వరకు ఏ ప్రభుత్వ అధికారి వచ్చి నా నష్టాన్ని నమోదు చేసుకుంది లేదు, పరిహారం ఇచ్చింది లేదు. నాలాంటి సన్న, చిన్నకారు రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి.

– కె.నరసింహారావు, రైతు, అచ్చంపేట

రెండు రోజులకే భోజనం ఆపేశారు..



మా కాలనీలోకి వరద నీరు రాగానే శనివారం, ఆదివారం భోజనాలు అందజేశారు. సోమవారం వరద నీరు కొంచెం తగ్గుముఖం పట్టగానే అధికారులు భోజనాలు పెట్టటం మానేశారు. ఇళ్లలో పెద్దఎత్తున బురద పేరుకుపోయింది. ఉండలేకపోతున్నాం. ప్రస్తుతం ఇళ్లలో ఉన్న బురద శుభ్రం చేసుకుంటున్నాం. సోమవారం సాయంత్రం రేషన్ కార్డుల ప్రకారం బియ్యం ఇచ్చి చేతులు దులుపుకున్నారు. అవికూడా అందరికీ ఇవ్వలేదు. కూలీపనికి పోయి మూడు రోజులవటంతో డబ్బులు లేక అప్పులు చేయాల్సి వస్తుంది.

– కంభంపాటి శేషారావు, జైల్‌సింగ్ కాలనీ, ధరణికోట

ఫొటోలు తీసుకున్నారు..



మా కాలనీకి ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు వరద నీరు వచ్చింది. అధికారులకు సమాచారమిచ్చినా స్పందనలేదు. స్థానిక నాయకులు, పంచాయతీ ట్రాక్టర్ల సాయంతో సాయంత్రం ఆరు గంటలకు పునరావాస కేంద్రాలకు చేరుకున్నాం. పునరావాస కేంద్రాలలో రెండు రోజులు ఉన్నా అధికారులు ఫొటోలు తీసుకుని వెళ్లటం తప్ప ఆహారం, తాగునీరు గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. మా వార్డులో నాయకులు, దాతల సహకారంతో కడుపు నింపుకున్నాం. మంగళవారం ఇళ్లకు చేరుకుని శుభ్రం చేసుకుంటున్నాం. ఈ రోజు వచ్చి రెవెన్యూశాఖ సిబ్బంది పేర్లు నమోదు చేసుకుంటున్నారు

– ఇంద్ల శివరామకృష్ణ, వడ్డెరకాలనీ, అమరావతి

పత్తి పంట పూర్తిగా నష్టపోయాను...



నేను ఐదు ఎకరాల్లో పత్తి పంట సాగుచేశాను. అంతా బాగుందనుకునే క్రమంలో భారీ వర్షాలకు పంట మొత్తం నీట మునిగింది. మూడు రోజులవుతున్నా అధికారులు కన్నెత్తి చూడలేదు. చివరకు నేనే తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేసినా ఇప్పటికీ ఏ అధికారి నా పొలంలోకి వచ్చి పంట నష్ట వివరాలు నమోదుచేసుకోలేదు.


–గోగిరెడ్డి బ్రహ్మారెడ్డి, రైతు, రుద్రవరం గ్రామం, అచ్చంపేట మండలం.

పిల్లేరు వాగులో వ్యక్తి గల్లంతు

పిడుగురాళ్ల: వాగులో ఇసుక మేటలో పూడకుపోయిన మీటర్‌ను వెలికి తీసేందుకు వెళ్లిన వ్యక్తి గల్లంతైన సంఘటన మండలంలోని కోనంకి గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించిన స్థానికులు తెలిపిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన శీలం శ్రీనివాసరావు(35) గ్రామంలో ఎవరి మోటర్ ఇసుక మేట వేసినా తీయటంతో దిట్ట. వాగు నీళ్లల్లో సుమారు 5 గంటల శక్తి ఉన్న వ్యక్తి శ్రీనివాసరావు. గ్రామానికి చెందిన పుణ్యాల సాంబశివరెడ్డి రైతుకు సంబంధించిన మోటార్ గ్రామ సమీపంలోని పిల్లేరువాగులోని నేరేడు చెట్టు మడుగు వద్ద పూడికపోయింది. మోటారును బయటకు తీసేందుకు వెళ్లాడు. ఇసుక మేటలో పూడుకుపోయిన మోటార్‌ను బయటకు తీశాడు. ఆ తర్వాత వాగు లోపలకు వెళ్లిన వ్యక్తి ఎంత సేపటికి బయటకు రాకపోవటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ ప్రాంతంలో మొసలి ఉందని, మొసలి ప్రభావం వలన గల్లంతయ్యాడా, మొసలి వలన ఏమైనా ప్రమాదం సంభవించిందా అని అనుమానం వ్యక్తం చేశారు. ఇదే ప్రాంతంలో గతంలో గ్రామానికి చెందిన కానాలా పేర్రెడ్డి అనే రైతు మృతి చెందాడని గ్రామస్తులు తెలిపారు. శ్రీనివాసరావును కూడా మొసలి ఏమైనా చేసిఉండవచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు పట్టణ పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించటంతో సంఘటన స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టినట్లు పట్టణ ఎస్‌ఐ ఎం.మోహన్ తెలిపారు.

దొడ్లేరు చెరువుకు గండి

- భయంతో చెరువుకు గండి కొట్టిన గ్రామస్తులు
- గండి పూడ్చివేతకు చర్యలు
- నీట మునిగిన వరి పొలాలు


గండి పడిన ప్రాంతం

దొడ్లేరు(క్రోసూరు): క్రోసూరు మండలం దొడ్లేరు గ్రామంలోని సాగునీటి చెరువుకు గండి పడింది. చెరువు కింద సాగు చేసుకుంటున్న వరి పొలాలు నీటమునిగాయి. వివరాలు ఇలా.. అల్పపీడన ప్రభావంతో వర్షాలకు చెరువులోకి భారీగా నీరు చేరింది. పొంగి ఊర్లోకి వస్తాయన్న ప్రమాద భయంతో గ్రామస్తులు చెరువుకు గండి పెట్టారు. గండి కారణంగా చెరువు కింద సాగు చేస్తున్న సుమారు 15 ఎకరాలలో వరి పంట నీట మునిగి రైతులు పూర్తిగా నష్టపోయారు. అంతేకాక దొడ్లేరు నుంచి పెరికపాడు గ్రామానికి వెళ్లే రహదారి రాకపోకలు నిలిచిపోయాయి. దీనిపై మైనర్ ఇరిగేషన్ అధికారులకు, గ్రామ పంచాయతీకి సమాచారం అందించినా ఫలితం లేకపోవటంతో సాక్షి మంగళవారం తహసీల్దార్ కె.శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లింది. ఆయన తక్షణమే స్పందించి చెరువుకు పడిన గండిని పూడ్చే విధంగా పంచాయతీ అధికారులకు ఆదేశించారు. యుద్ధప్రాతిపదికన గండి పూడ్చివేత పనులు చేపట్టారు.

పంట నష్టం గుర్తించేందుకు కమిటీ వేస్తాం

దొడ్లేరులో గ్రామంలోని రైతుభరోసా కేంద్రం సిబ్బంది గండి పడిన ప్రదేశాన్ని పరిశీలించారు. తాము కూడా పరిశీలిస్తాం. చెరువు కింద ఉన్న పొలాలన్నీ మాగాణి పొలాలే. దగ్గర్లో ఉన్న కొన్ని పొలాల్లో మట్టి, ఇసుక మేట వేశాయి. ప్రభుత్వ నిబంధన ప్రకారం చర్యలు తీసుకుంటాం. గ్రామస్థాయి కమిటీ వీఆర్వో, ఏఏవో, పీఎస్‌లతో కూడిన కమిటీ నుంచి నివేదిక తీసుకొని ప్రభుత్వానికి పంపిస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నడుచుకుంటాం.

– వేణుగోపాల్, ఏఓ, క్రోసూరు.

రామాపురం సమస్యను ప్రభుత్వానికి నివేదిస్తాం

- జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు
- వరద ముంపు గ్రామమైన రామాపురంలో పర్యటన
- దెబ్బతిన్న పంటల పరిశీలన


రామాపురంలో వరదతో దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

దాచేపల్లి: వరద ముంపు గ్రామం రామాపురంపై ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు చెప్పారు. వరద ముంపు గ్రామమైన రామాపురంలో జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు మంగళవారం పర్యటించారు. తొలుత మత్స్యకారులు తలదాచుకున్న పునరావాస కేంద్రాన్ని పరిశీలించి వారితో మాట్లాడారు. వసతులపై ఆరా తీశారు. ప్రభుత్వం నుంచి బియ్యం, కందిపప్పు, ఉల్లిపాయలు, నూనెతో పాటుగా పలు నిత్యావసర వస్తువులను బాధితులకు అందజేశారు. వరద ముంపు తగ్గే వరకు పునరావాస కేంద్రం నిర్వహిస్తామని, అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని కలెక్టర్ భరోసా ఇచ్చారు. అనంతరం వరద నీటిలో మునిగిన మత్స్యకారుల ఇళ్లను కలెక్టర్ పరిశీలించారు. నష్టం వివరాలు అంచనా వేసి పంపించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. వరద నీటిలో మునిగిన పంటలను కలెక్టర్ పరిశీలించి రైతులతో మాట్లాడారు. పంట నష్టం వివరాలు కూడా నమోదు చేయాలని వ్యవసాయశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ పులిచింతల బ్యాక్‌వాటర్ వలన రామాపురం గ్రామంలోని ఇళ్లకు వరద నీరు చేరిందని, వందల ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. తరచూ వరద ముంపు కారణంగా ఈ గ్రామంలో పంటలు సాగుచేసేందుకు రైతులు ఇష్టపడటంలేదని, రైతులకు జరుగుతున్న నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. మత్స్యకారులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని, వరద కారణంగా దెబ్బతిన్న పడవలు, బోట్లకు నష్ట పరిహారం అందిస్తామని కలెక్టర్ తెలిపారు. అనంతరం స్త్రీశక్తి, ఐశ్వర్య, శాంతి డ్వాక్రా గ్రూప్‌లకు రూ2.80లక్షల వడ్డీలేని రుణాల చెక్కులు కలెక్టర్ అందజేశారు. కలెక్టర్ వెంట ఆర్డీవో జీవీ. రమణకాంత్‌రెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రమణారెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌వో రవి, డీఆర్‌డీఏ పీడీ బాలూ నాయక్, డీఎల్‌డీవో గ్రబూనాయక్, తహసీల్దార్ వై.వీ.కుటుంబరావు, ఎంపీడీవో శోభారాణి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వేముల వినోద్‌రెడ్డి, ఎంపీటీసీ ఆకూరి వెంకటరెడ్డి, సర్పంచ్ రామకోటయ్య తదితరులు ఉన్నారు.

కోడిపందేల స్థావరంపై దాడి

- ప్రజాప్రతినిధి బంధువు ఆధ్వర్యంలో బరి
- భారీగా తరలివచ్చిన పందేగాళ్లు
- ఎస్పీకి సమాచారం రావడంతో దాడులు
- 15 మంది అరెస్ట్
- 15 బైక్‌లు, 10 కోళ్లు స్వాధీనం

నరసరావుపేటరూరల్: నరసరావుపేట మండలం అచ్చమ్మపాలెంలో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై రూరల్ పోలీసులు దాడి చేశారు. 15మంది పందెం రాయుళ్లను అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి 10 కోళ్లు, 15 బైక్‌లు, రూ.33.200 నగదు స్వాధీనం చేసుకున్నారు. కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు రూరల్ సీఐ పి.రామకృష్ణ, ఎస్‌ఐ సీహెచ్ కిషోర్‌ల ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేశారు. కోడిపందేల నిర్వాహకుడు తిరుపతిరాజును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎస్పీ ఆదేశాలతో దాడులు

ప్రజాప్రతినిధికి బంధువునంటూ నియోజకవర్గంలో హల్‌చల్ చేస్తున్న స్థానికేతరుడి ఆధ్వర్యంలో అచ్చమ్మపాలెంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారు. మంగళవారం కోడి పందేలను కూడా ఈయనే కొబ్బరికాయ కొట్టి ప్రారంభించాడు. సంబంధిత స్టేషన్‌లో కోడిపందేల నిర్వహణపై పోలీసు అధికారితో ముందస్తుగా ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. పోలీసుల నుంచి అనుమతి వచ్చిన తరువాతే పెద్ద ఎత్తున పందేలకు బరిని సిద్ధం చేశారు. నియోజకవర్గంతో ఇతర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో కార్లలో, వాహనాల్లో పందేగాళ్లు అక్కడికి తరలివచ్చారు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఆరా తీశారు. ఈ వ్యవహారం జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు దృష్టికి వెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు స్పెషల్ బ్రాంచ్, రూరల్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. కోళ్లను, జూదగాళ్లను అరెస్ట్ చేశారు. ముందస్తు సమాచారం అందుకున్న కొంతమంది అక్కడి నుంచి పరారయ్యారు. కోడి పందేలకు సుమారు 170మంది వరకు హాజరవ్వగా పోలీసులు 15మందినే అదుపులోకి తీసుకోవడం గమనార్హం.